గల్పిక:

# కలవారి అగచాట్లు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఎవరో తలుపు తట్టారు. వెళ్ళి తీశాను. ఎవరో తెలుగాయనే. "క్షమించండి. నే నీపక్క ఇంట్లో కుటుంబంతో వచ్చిచేరాను," అన్నాడు ఇంగ్లీషులో.

నేను అరవ్వాణ్ణని పొరపడ్డాడేమో అనుకుని, "చాలా సంతోషమండీ. మాకు తోడుగా ఉంటారు. మైలుదూరంలో ఎక్కడా తెలుగువాళ్లు లేరు," అన్నాను.

కాని ఆయన నా సంతోషాన్ని గమనించకుండా, ఇంకా ఇంగ్లీషులోనే మాట్లాడుతూ, "నాకు ఇద్దరో ముగ్గురో పనివాళ్లు కావాలి, సార్. మీరు కుదిర్చిపెట్టగలరా?" అని అడిగాడు.

"పనివాళ్ల కేమండీ ఈ చుట్టుపక్కల చాలామంది పనిచేసుకు బతికేవాళ్లేనే," అన్నాను తెలుగులోనే.

ఆయనకష్టాలకు నేనే బాధ్యుణ్ణయి ఉండాలన్న అనుమానం సూచించే గొంతు పెట్టి, "యూ సీ, మా కుటుంబానికి నలుగురు పనివాళ్ళన్నా లేందీ జరగదు. కనీసం ఇద్దరుముగ్గురన్నా పెట్టుకుందామంటే వాళ్ళు నన్ను మింగెయ్యాలని చూస్తున్నారు. ఒకరికి మూడుపూట్లా భోజనాలుట! ఇంకొకరికి రెండు భోజనాలూ, రెండు కాఫీలూ కావాలిట! మరొకర్ని దొడ్లో పాకా వేసి ఉంచాలిట! ఇది కాక పదిరూపాయ లియ్యమనీ, ఏడు రూపాయ లియ్యమనీ అడుగుతున్నారు! ఇంత పచ్చికలి నే నెక్కడా చూడలేదు." అన్నాడాయన ఇంగ్లీషు గళగ్రాహిగా మాట్లాడుతూ.

"మీకు రోజల్లా పనిచేసేవాళ్లు కావాలా ఒకటి రెండుగంటలు పని చేసే వాళ్ళు కావాలా?" అన్నాను.

"మాపని ఒకటిరెండుగంటల్లో తెలేది కాదు, సార్. రోజల్లా ఇంట్లోనే ఉండాలి. ఒక పనిదాన్ని మాట్లాడితే అది పొద్దాకగానే మొగుడూ పిల్లలను చూసుకోబోతా నంటుంది. రాత్రి తొమ్మిదిదాకా అన్నా ఉండదుట!"

"మీరే మిస్తామంటారు?"

"అన్నాలూ కాఫీలూ లేకుండా అయిదేసి రూపాయలిస్తా నన్నాను. రారుట! ఇటువంటి ఊరు నేనెక్కడా చూడలేదు," అన్నాడాయన.

లెక్క వేశాను. ఉదయం అయిదునుంచీ రాత్రి తొమ్మిదిదాకా పనిచేసినందుకు మనిషికి అయిదురూపాయ లిచ్చేటట్టయితే ఆ మనిషి ఏమి తిని బతకాలీ? ఏమీ తినీ బతకలేదు. ఆజీతానికి ఒప్పుకునే పనివాళ్ళు ఎక్కడన్నా ఉంటే వాళ్ళు ఆత్మహత్యకు ఒప్పుకున్నవాళ్ళన్నమాటే. అటువంటివాళ్ళే నాకూ కావాలి. నేనూ ఇంత కలవాణ్ణే. ఒకరిద్దరు పనిమనుషులను నేనూ పెట్టుకోగలను-వాళ్ళు ఆత్మహత్యకు సిద్ధపడితేనుమండీ!

"అయ్యా, మీ రే వూరునుంచీ వస్తున్నారు?" అన్నాను.

"ఏం?" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"మరేం లేదు. నేను అవూళ్ళో కాపరం పెడదామనీ! నాకు ఉద్యోగమే చెయ్యాలని లేదు. ఇన్నేళ్ళు నౌకరీచేస్తున్నానుగాని మా ఆవిడకు ఒక్క పనిమనిషిని పెట్టలేకపోయాను. మీరు ఉండివచ్చిన ఊరు వెళ్లితేనా ఈ జీవితకోర్కె సిద్ధించేటట్టు కనపడుతోంది! అన్నాను.

---

అమెరికన్ హైకమిషనర్ జాన్ జె మెక్లాయ్ ఒక ప్రకటన చేశాడు: జర్మనీ ఐక్యతా సాధనే తూర్పు జర్మనీకమ్యూనిస్టుపార్టీకి నిజంగా లక్ష్యమైనట్లయితే ఈ సమస్యపైనే జర్మనీఅంతటా, అనగా పశ్చిమజర్మనీలోకూడా, ఎన్నికలు జరపాలని సూచించాడు అయితే తూర్పు జర్మనీలో ఎన్నికల్లో పాల్గొనడానికి అన్ని రాజకీయపక్షాలకీ పూర్తి స్వేచ్ఛ నివ్వాలనీ, ఎన్నికల ప్రచారం జరుపుకోడానికి పోలీసుకట్టుబాటులను సడలించాలనీ షరతులు పెట్టాడు ఈ షరతులకూ, జనవాక్యనిర్ధారణకూ తూర్పుజర్మనీ అంగీకరించినట్లయితే, అక్టోబరులో పశ్చిమజర్మనీలో తిరిగి ఎన్నికలు జరపడానికి పశ్చిమజర్మనీప్రభుత్వం సమ్మతిస్తుందని పశ్చిమ జర్మనీప్రధాని అన్నాడు. కాని ఈవిషయమై తూర్పు జర్మనీప్రభుత్వం ఎట్టి సమాధానం ఇవ్వలేదు.

ఇది కేవలం ప్రచారంనిమిత్తం చేయబడిన ప్రతివాదనేకాని వాస్తవంగా పశ్చిమజర్మనీలో ఇప్పుడు తిరిగి ఎన్నికలు జరపడానికి ఆంగ్లో-అమెరికన్ అధికారులు అంగీకరించేమాట సందేహం. పోగా ఫ్రెంచి-సార్ ఒడంబడికను రద్దుపరచాలని తూర్పు జర్మనీ నిర్బంధం విధించినట్లయితే ఫ్రాన్సు అంగీకరించడం అసంభవం. జర్మనీసమస్య ఈరీతిగా పరిష్కారం కావడం అసాధ్యం.

[సూర్యనారాయణ]

---


## తెలుగు మెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రి,

తెలుగుదనము, తెలుగు సంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము. తెలుగు తేటదనము, తెలుగుకవితాపారమ్యము శాస్త్రి గారి పాతిక ముప్పయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించి యున్నది. వెల రు. 2/- తపాలాఖర్చులు 0-7-0.

## శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము : వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

సంస్కృతమూలము. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు వ్రాసిన తెలుగు టీకా తాత్పర్య విశేషార్థ వివరణలుగల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనము చేయువారికి మిక్కిలి ఉపయుక్తమైనది. ఖద్దరు బైండు.

ఆంధ్ర గ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.